క్లుప్తంగా

దేశ అభివృద్ధి బీజేపీతోనే..

కోయిల్‌కొండ: ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే దేశం అభివృద్ధి సాధిస్తోందని పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కో కన్వీనర్ కెంచె శ్రీనివాసులు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు శ్రీధర్, రాములుగౌడ్, గోవింద్‌నాయక్, వేణు, గురునాథ్, రమేష్, వీరేష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా రామునాయక్

కోయిల్‌కొండ: లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా కేశ్వాపూర్‌నకు చెందిన రామునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి విస్లావత్‌నాయక్ తెలిపారు. ప్రధానకార్యదర్శిగా కాట్రావత్ రాజునాయక్, గౌరవఅధ్యక్షుడిగా కేతావత్‌శంకర్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యాదగిరినాయక్, అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనునాయక్, ఉపాధ్యక్షులుగా బిఖ్యానాయక్, సీతారాంనాయక్ తదితరులను ఎన్నుకున్నారని వివరించారు.

బకాయిలు విడుదల చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో పెడితే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే చెల్లింపులు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక..

దేవరకద్ర: మండల కేంద్రానికి శనివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వస్తున్నారని పంచాయతీ ఈవో సీత్యానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోయిల్‌సాగర్ రోడ్డులో నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ పొందే లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తారని వివరించారు.

అంజన్నకు ఘనంగా పూజలు



దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయ స్వామికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేశారు. వేద పండితులు పూజలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు.

వాసవీమాతకు పల్లకీసేవ..



దేవరకద్ర: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు, దంపతులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం ఆలయంలో సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం, పల్లకీసేవ నిర్వహించారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు

దేవరకద్ర రూరల్: అంకిత భావంతో పనిచేస్తేనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని మండల విద్యాధికారి జయశ్రీ అన్నారు. శుక్రవారం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బదిలీ అయిన హెచ్‌ఎం వెంకటేశ్వర్లును అభినందించారు. ఉపాధ్యాయ బృందంతో కలిసి ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం, నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, మురళీధర్, కల్పన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామ పంచాయతీల నిర్వహణకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని.. నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కరుణశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. నిధుల కొరత వల్ల నిర్వహణ, సిబ్బంది జీతాలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.



నాణ్యమైన భోజనం అందించండి

● కలెక్టర్ విజయేందిర

గండేడ్: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని.. చదువుతో పాటు దీన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ విజయేందిర పేర్కొన్నారు. శుక్రవారం వెన్నాచేడ్, సల్కర్‌పేట్ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. వెన్నాచేడ్ సబ్‌సెంటర్‌లో ఓపీ రిజిస్టర్ తదితరాలను పరిశీలించారు. ఏఎన్‌ఎం లక్ష్మి, స్థానికులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. టీబీ కేసులు ఎక్కువగా వస్తున్నాయని.. వాటిని తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పక్కా భవనం గురించి అడిగి.. తహసీల్దార్‌కు చెబుతానని వివరించారు. అనంతరం గ్రామపంచాయతీని పరిశీలించారు. ఆయిల్‌బాల్స్, ఫాగింగ్‌పై పంచాయతీ కార్యదర్శిని అడిగారు. మల్టీపర్పస్ వర్కర్ల పని గురించి ఆరా తీశారు. కాగా వెన్నాచేడ్ బ్యాంకు మేనేజర్ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని.. లోన్లు ఇవ్వడం లేదని రైతులు ఆమెకు ఫిర్యాదు చేశారు. కాగా కలెక్టర్ స్పందిస్తూ సమస్యను పరిష్కరించేలా చూస్తామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పౌష్టికాహారం అందజేతపై ఆరాతీశారు. పర్యవేక్షణ లోపించదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు షోకాజ్‌నోటీసులు ఇవ్వాలని సీసీకి సూచించారు. తరుచుగా తనిఖీ చేయాలని ఎంపీఈఓ నరేందర్‌రెడ్డికి సూచించారు. బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పలు విషయాలపై హెచ్‌ఎం ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడగా.. నీళ్ల చారు పెడుతున్నారంటూ చెప్పడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ వారిని కూడా ఆమె ప్రశ్నించారు. భోజన సమయంలో ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం సల్కర్‌పేట్ సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. పలు విషయాలను ఏఎన్‌ఎం శైలజను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య ఉన్నారు.



వెన్నాచేడ్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

ఓజోన్ క్షీణతతో అనర్థాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం జంతు, రసాయనశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఓజోన్ క్షీణత ప్రస్తుత పరిస్థితులు-మానవుని పాత్ర అన్న అంశంపై విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రిన్సిపాల్ డా. సుకన్య ప్రారంభించి ప్రసంగించారు. మానవుని కార్యకలాపాల వల్ల ఓజోన్ ఏ విధంగా క్షీణతకు గురవుతుందో.. దానిని వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. పోటీల్లో విద్యార్థులు సందేశాత్మకంగా తయారు చేసిన వివిధ పోస్టర్లను ప్రిన్సిపాల్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు, రసాయనశాస్త్ర విభాగాధిపతి డా. రుఖియాభాను, జంతుశాస్త్రవిభాగాధిపతి వేణు, న్యాయనిర్ణేతలు డా. పావని, ప్రవీణ్‌కుమార్, డా. నాగలక్ష్మితోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు. పోటీల్లో 84మంది విద్యార్థులు 28 టీములుగా పాల్గొనగా అజ్మి, మనీషా, సర్వత్‌లు ప్రథమ బహుమతి పొందారు. ద్వితీయ బహుమతిని షాజియా, మౌనిక, దీపికలు, తృతీయ బహుమతి రాజేశ్వరి, స్వప్న, భూమికలు పొందారు. అశ్విత, శిరీషలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుకన్య

నిధుల కొరతతో జీతాలు ఇవ్వడానికి ఇబ్బందులు

అడ్డాకుల: గ్రామ పంచాయతీల నిర్వహణలో కార్యదర్శులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్యదర్శులు డిమాండ్ చేశారు. మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలపై ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఉన్నందున పంచాయతీ నిర్వహణ, సిబ్బంది జీతాల చెల్లింపులకు ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఓపీఎస్ కార్యదర్శులకు 8 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, పంచాయతీ నిర్వాహణకు సొంత డబ్బులు వెచ్చించాల్సి రావడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని వాపోతున్నారు. మహేందర్, సురేష్, సతీష్, మాధవి, సంతోషీ, అఖిల్, కార్తీక్, రఘు తదితరులు ఉన్నారు.



మూసాపేటలో వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుమలాపూర్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం సుమారు రూ. 400 కోట్లు నిధులు వెచ్చించి 20 వేల క్రికెట్ కిట్లు కొనుగోలు చేసిందని.. అవి ఏమాత్రం నాణ్యంగా లేవని ఆరోపించారు. నాసిరకం సామగ్రి కొనుగోలు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం మూడెకరాల స్థలం కావాలని తహసీల్దార్లకు సూచించినట్లు వివరించారు. తిరుమలాపూర్‌లో పశువైద్యశాల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లెటర్ రాసినట్లు వివరించారు. వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. హెచ్‌ఎం సుధాకర్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మక్బూందర్, రంగారెడ్డిగూడ హెచ్‌ఎం రఘునందన్‌రెడ్డి, నాయకులు నరహరి, కృష్ణయ్య, యాదయ్య, విక్రంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బచ్చిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రాజాపూర్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. జీపీ కార్మికుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు.

ఉత్సాహంగా పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రూరల్ మండలంలోని ధర్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడలు ఉత్సాహంగా జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల బాల, బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్‌తోపాటు పలు పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



దేవరకద్ర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు, తల్లిబిడ్డలకు పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పౌష్టికాహారంనకు సంబంధించిన వివిధ రకాల పదార్థాలు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, పండ్లు తదితరాలను ప్రదర్శించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛత హీ సేవ'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం కొనసాగుతోంది. మూడోరోజు శుక్రవారం 13వ వార్డు పరిధిలోని బండమీదిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘ సభ్యులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ సంచులు వాడాలన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కళాశాల ఆవరణలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లూర్‌లో పశువైద్య శిబిరం



నవాబుపేట: కొల్లూర్‌లో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశవ్యాధి నివారణ తదితర వాటిపై పశువులను పరిశీలించి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రవిచంద్ర, డాక్టర్ రమేష్‌తో పాటు వాసుయాదవ్, రామకృష్ణ, వెంకటయ్య, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ ఇళ్ల'ను పంపిణీ చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేయలేకపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లె గోపాల్, జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మాచన్‌పల్లి, రామచంద్రాపూర్ గ్రామాల్లో మహాసభలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళి అర్పించారు. అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. హన్మంతు, నర్సిములు, భగవంతు, లింగంగౌడ్, శివలీల, ఖాదర్, బాలకృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్

పాట ఉన్నంతవరకు ప్రజల గుండెల్లో..

జడ్చర్ల టౌన్: పాట బతికున్నంత వరకు సాయిచంద్ ప్రజల గుండెల్లో జీవించే ఉంటాడని ఆయన ఆశయ సాధనకు పాటుపడదామని రజని సాయిచంద్ అన్నారు. శుక్రవారం సాయిచంద్ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ సహకారంతో కాల్వ రాంరెడ్డి నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. శిబిరంలో 41మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ నటరాజ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కైలాస్‌జవహర్ పాల్గొన్నారు.

అడ్డాకుల: సాయిచంద్ జయంతిని శుక్రవారం అడ్డాకులలో ఘనంగా నిర్వహించారు. సాయిచంద్ సతీమణి రజనీ హాజరై నివాళులర్పించారు. ప్రశాంత్, మహేష్‌యాదవ్, బాలరాజు, జహంగీర్, డేవిడ్, మనోహర్, రాజు, వెంకటేష్, నక్క రమేష్, చెన్నకేశవులు, సందీప్, తిరుపతి తదితరులు ఉన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న రజని సాయిచంద్

సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయాలి

జడ్చర్ల టౌన్: ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేందుకు కృషిచేయాలని మండల అధికారులను జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రధాన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలు ఆలస్యం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 30, వచ్చే నెల 1న పంచాయతీ కార్మికులకు హెల్త్ చెకప్‌లు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు 55 ఉండగా 35 మాత్రమే పూర్తి నివేదికలు అందాయని.. మిగతా వాటి జాప్యంపై ప్రశ్నించారు. వారం రోజుల్లో అందించాలని ఆదేశించారు. ఆలూరు గ్రామాన్ని సందర్శించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా లేవని ఆగ్రహించారు. గ్రామ కార్యదర్శికి చార్జ్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

నవాబుపేట: జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నవాబుపేట మండల సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు తదితరులు శుక్రవారం డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. మండల సంఘానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రుణాల శాతం పెంచాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తమ తండాలో సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని 13వ వార్డు పరిధిలోని గొల్లబండతండా వాసులు కలిసి వేడుకున్నారు. దీంతో ఆయనతో పాటు ఎంఈ యు.బస్వరాజ్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. కాగా, పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారని, వీధి లైట్లు వెలగడం లేదని స్థానికులు వాపోయారు. పట్టణానికి 3 కి.మీ. దూరంలో ఉండటంతో ఇక్కడికి అధికారులెవరూ రావడం లేదన్నారు. ముఖ్యంగా ఎత్తు ప్రదేశంలో ఉండటంతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు సరిగా సరఫరా కావడం లేదన్నారు. ఇక్కడ సుమారు 150 కుటుంబాలు ఉంటాయని, వెంటనే పవర్ బోరు వేయించాలన్నారు. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఈ సమస్యల పరిష్కారానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు.



గొల్లబండతండాలో పర్యటిస్తున్న మున్సిపల్ అధికారులు

ఘనంగా మట్టి గణపతి నిమజ్జనం



కోలాటం వేస్తున్న చిన్నారులు

దేవరకద్ర రూరల్: కౌకుంట్లలో శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. 14 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనం ప్రత్యేకంగా కొనసాగింది. భక్తులు భజన కీర్తనలతో పాటు, మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి.



ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

వరిసాగులో మెళకువలు పాటించాలి



దేవరకద్ర రూరల్: వరిసాగులో రైతులు అప్రమత్తంగా ఉండి మెలుకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం సభ్యులు అన్నారు. శుక్రవారం పెద్దరాజమూర్ గ్రామంలో పర్యటించారు. వరిపంటను పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు శరత్ భూషణ్ రావు, రామ్‌రెడ్డి, విజయలక్ష్మి, దివ్యరాణి. ఏడీఏ యశ్వంత్‌రావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఏఈఓ హరిష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

పాలమూరులో డ్రై డే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని మొత్తం 49 వార్డుల పరిధిలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగారు. ముఖ్యంగా ఆవరణలోని సంప్‌లు, తొట్లలో నిల్వ నీటిని పారబోయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులతో ఆయా వీధుల్లోని మోరీలను శుభ్రం చేయించారు. అక్కడక్కడా పడేసిన చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

రాజభవనం వద్ద ఫ్లోరింగ్ పనులు ప్రారంభం

వనపర్తిటౌన్: పట్టణంలోని కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల ముందు భాగంలో చేపట్టిన ఫ్లోరింగ్ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల ముందు భాగంలో అనాలోచితంగా వేసిన సీసీ రోడ్డుతో వర్షపు నీరు కాలేజీలోకి వెళ్తోందని విమర్శించారు. విద్యార్థుల అవస్థలను ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారని వివరించారు. సతీష్, వెంకటేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌లో రిజర్వేషన్ అమలుకు పోరాటాలు

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగ, మాల అనుబంధ కులాలు వర్గీకరణ పెంపునకు, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ అమలుకు పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని.. ఎమ్మార్పీఎస్ -ఆర్ఆర్ మాదిగ సంఘాల జేఏసీ నాయకులు రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, మీసాల రాము పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ధర్మం గెలిచిన సభ నవంబర్‌కు వాయిదా వేసినట్లు తెలిపారు. ఎల్.రమేష్, కాలె నరేందర్, తిరుమలయ్య, విజయ్, బి.రాములు, బిక్షపతి, వన్నడ అంజన్న, దండు దేవన్న, పి.నగేష్, సి.నర్సిములు పాల్గొన్నారు.